మిషన్ భగీరథ నీరు నిలిచిపోవడంతో మోటర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

సింగారంలో వాటర్ బంద్

- నాలుగు రోజులుగా నీళ్లు లేక అవస్థలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి

సింగిల్ ఫేజ్ మోటర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

అచ్చంపేట రూరల్, జూన్ 9 : మండలంలోని సింగారం గ్రామంలో నాలుగు రోజులుగా నీళ్లు రాకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కేసీఆర్ హయాంలో ఇంటింటికీ నల్లా ద్వారా మిషన్ భగీరథ నీళ్లు ఇవ్వగా.. గ్రామంలో రోజువారీగా రావాల్సిన భగీరథ నీళ్లు పైప్ లైన్ మరమ్మతుల దృష్ట్యా బ్రేక్ పడింది. గ్రామంలో ఉన్న రెండు బోరు మోటర్లు గతంలోనే కాలిపోగా గ్రామస్తులు స్పెషల్ ఆఫీసర్ రాములు, పంచాయతీ కార్యదర్శి మంగ్తా నాయక్‌కు సమాచారమిచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అసలే విత్తనాలు వేసుకునే సమయం కావడంతో మహిళలు పొద్దున్న పొలం దగ్గరికి పొయిన వారు రాత్రి ఏడు గంటలకు ఇంటికి చేరుకొని గ్రామంలో సింగిల్ ఫేజ్ మోటర్ల వద్ద బిందెలతో తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూ ఏఈ మధుబాబును వివరణ కోరగా మిషన్ భగీరథ వాటర్ పైప్‌లైన్ తెల్కపల్లి –రాకొండ గ్రామాల మధ్య మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. సోమవారం ఉదయం వరకు నీటిని అందిస్తామని చెప్పారు. అదేవిధంగా సింగారంలో కాలిపోయిన మోటర్లకు స్వయంగా వెళ్లి మరమ్మతులు చేయిస్తామని బదులిచ్చారు.

తాగునీళ్లకు ఇబ్బందిగా ఉంది..

వానకాలం కావడంతో విత్తనాలు వేసుకునే పనుల్లో బిజీగా ఉన్నాం. ఈ టైంల మంచినీళ్లు నాలుగు రోజులుగా లేకపోవడం ఇబ్బందిగా మారింది. పొలం పనులు చేసుకొని వచ్చి రాత్రి పూట మోటర్ల దగ్గర నీళ్లు తెచ్చుకుంటున్నం. పొద్దంతా పనులు చేసి అలసిపోయివస్తం. ఇంట్ల నీళ్ల కోసం బిందెలు పట్టుకొని వీధుల్లో తిరగాల్సి వస్తుంది. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వెంటనే మాకు నీళ్లు వచ్చే ఉపాయం చేయాలి. **–కొండెమోని బుచ్చమ్మ, గ్రామస్తురాలు**

అధికారులు పట్టించుకోవడం లేదు..

మా ఇల్లు ఊరి చివరన ఉంటుంది. సింగిల్ ఫేజ్ మోటర్లు మాకు దగ్గరలో లేవు. మాకు ఇద్దరు పిల్లలున్నారు. వారిని ఇంట్లో వదిలి నీళ్ల కోసం ఎక్కడికో వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మహిళలు పొలం పనులు, వంట పనులు చేయడానికి సమయం సరిపోవడం లేదు. అది సరిపోదన్నట్లు నీళ్ల కోసం బిందెలు తీసుకొని వీధుల్లో తిరగాలంటే ఇబ్బందులు పడుతున్నరు. సమస్యను పరిష్కరించి నీళ్లు ఇస్తే బాగుంటుంది. **– వర్దం శరత్‌బాబు, గ్రామస్తుడు**

గురుకుల విద్యార్థుల ప్రతిభ

మహేశ్, 1648 ర్యాంకు

చంద్రవంశీ,3735 ర్యాంకు

సూర్య 5231 ర్యాంకు

కల్వకుర్తి, జూన్ 9 : జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జేపీ నగర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మహేశ్ ఎస్టీ కేటగిరిలో 1648వ ర్యాం కు, ఎస్సీ కేటగిరిలో చంద్రవంశీ 3735, సూర్య 5231, హరి 7661ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ దానం తెలిపారు. అదేవిధంగా నీట్ పరీక్షలో 8 మంది జేపీ నగర్ విద్యార్థులకు మెడిసిన్‌లో ప్రవేశం పొందే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ చెప్పా రు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆర్సీవో వనజ, ప్రిన్సిపాల్ దానంతోపాటు అధ్యాపక బృందం, సిబ్బంది అభినందించారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

నాగర్‌కర్నూల్‌లో ఎస్టీయూ జెండావిష్కరిస్తున్న మురళి

నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 9 : జిల్లా కేంద్రంలో ఆదివారం ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘ భవనం వద్ద జిల్లా అధ్యక్షుడు మురళి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయి పడ్డ నాలుగు డీఏలను చెల్లించాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. పీఆర్సీ నివేదికను తెప్పించి వెంటనే అమలు చేయాలని, ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌ను నియమించాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏలో పని చేసే ఉద్యోగులకు భద్రత కల్పించడంతోపాటు టైం స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి రమేశ్, నాగర్‌కర్నూల్ మండలాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డితోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలూరులో భారీ చోరీ

గట్టు, జూన్ 9 : కుటుంబసభ్యులు దైవదర్శనం వెళ్లగా ఇదే అదనుగా భావించి ఇంట్లోకి చొరబడి భారీ చోరీ చేసిన ఘటన మండలంలోన ఆలూరులో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నర్సన్‌గౌడ్ తన కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి శుక్రవారం ఉదయం మన్యంకొండకు బయలుదేరారు. అక్కడ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని శనివారం సాయంత్రం ఆలూరుకు చేరుకున్నారు. నర్సన్‌గౌడ్ కుటుంబసభ్యులు ఇం టి తలుపులు తెరిచి చుడగా బెడ్‌రూంకు వే సిన తాళం పగులగొట్టడాన్ని గమనించారు. బీరువా తెరిచి ఉండడాన్ని గ్రహించారు. బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.50వేల చోరీకి గురైనట్లు వారు గుర్తించారు. బాధితుడు నర్సన్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విచారణ చేస్తున్నామని, ఎస్సై స్పష్టంచేశారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ

- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- జిల్లా వ్యాప్తంగా 18 కేంద్రాల్లో పరీక్షలు
- 5,221మంది అభ్యర్థులకు గానూ 4,184 మంది హాజరు

నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నాగర్‌కర్నూల్, జూన్ 9 : గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని ఆయా పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పరిశీలించారు. జిల్లాలో 5 వేల 221 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా వారికోసం జిల్లా వ్యాప్తంగా 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం నిర్వహించిన పరీక్షకు 4 వేల 184 మంది అభ్యర్థులు హాజరు కాగా, 103 మంది గైర్హాజరయ్యారు. ఇందులో 2,657మంది పురుషులు కాగా, 1,527మంది మహిళా అభ్యర్థులు పరీక్షను రాశారు. గైర్హాజరైన వారిలో 621మంది పురుషులు కాగా, 416మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. బయోమెట్రిక్ హాజరు నిబంధనల ఉండడంతో అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నాగర్‌కర్నూల్ పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాల, పాలెంలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలోని పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, ఓఎంఆర్‌షీట్ల పంపిణీ తదితర సౌకర్యాలను పరిశీలించారు.

అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ కట్టుదిట్టమైన గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్షల సందర్భంగా జిల్లా కేంద్రంలోని 14 సెంటర్లు, పాలెంలోని 2 సెంటర్లు, తెలకపల్లిలోని 2 పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులతో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాశారన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్‌తో కలిసి సందర్శించారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, జూన్ 9 : మండలంలోని పాలెం గ్రామంలో ఆదివారం జరిగిన గ్రూప్–1 పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్‌లు తనిఖీ చేశారు. శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 312 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 288 మంది మొత్తం 600 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. కాగా పరీక్షా కేంద్రాలను కలెక్టర్, ఎస్పీలు సందర్శించి విద్యార్థులకు అన్ని వసతులు పరిశీలించారు. ఇదిలావుండగా ఐదుగురు 2 నుంచి 10 నిమిషాలు లేటుగా రావడంతో వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు.

నాగర్‌కర్నూల్ పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

పాలెంలో పరీక్షా కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

మార్చాలలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కల్వకుర్తిరూరల్, జూన్ 9 : కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో కావలి కృష్ణయ్య, కుర్మిద్ద గ్రామంలో లాల్‌కోట యాదయ్యగౌడ్ కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌గౌడ్ గ్రామ మాజీ సర్పంచ్ దామోదర్‌గౌడ్‌తోపాటు పలువురు నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా యాదయ్యగౌడ్‌కు గౌడ సంఘం నుంచి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించగా మార్చాల గ్రామంలో రైతు సమన్వయ సమితి కన్వీనర్ కృష్ణారెడ్డి రూ.ఐదు వేల ఆర్థిక సాయం, మార్చాల ఎంపీటీసీ సంతోషామల్లేష్ యాబై కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, మధన్‌మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

అజిలాపూర్‌లో..

వెల్దండ, జూన్ 9 : మండలంలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన కాసా ముసలయ్య భార్య ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు సిద్దగోని రమేశ్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆర్కెగౌడ్, బుడ్డ రాములు, కృష్ణయ్య, కుమార్, మామిడియాదయ్య, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

కేంద్ర మాజీ మంత్రి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న రవిప్రకాశ్

నల్లమల వాసికి అవార్డు

బల్మూరు, జూన్ 9 : తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మైలారానికి చెందిన రవిప్రకాశ్‌కు అవార్డు అందజేసి శాలువాతో సన్మానించారు. రవిప్రకాశ్ కవితల రంగంలో ఎంతోమందిని చైతన్యపర్చుతూ వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పేద విద్యార్థుల చదువుకు సహాయం చేయడం, ఇతర రంగాల్లో సేవ చేయడంతో అవార్డు పొందినట్లు గ్రహీత తెలిపారు. అవార్డు ప్రదానోత్సవంలో కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, తెలంగాణ శాసనసభ మొదటి స్పీకర్ మధుసూదనాచారి పాల్గొన్నారు.

కారు బైకు ఢీ : యువకుడు మృతి

వెల్దండ, జూన్ 9 : కారు బైకు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం వెల్దండ మండలం ఎంజీకాలనీ ఈతండాకు చెందిన రాత్లావత మంగ్యానాయక్ (32) హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం కల్వకుర్తిలో ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు హైదరాబాద్ నుంచి కల్వకుర్తికి బైక్‌పై వస్తుండగా వెల్దండ సమీపంలోని శ్రీశైలం జాతీయ రహదారిపై యెన్నం దవాఖాన వద్ద కారు బైక్ ఢీకొట్టుకోవడంతో మంగ్యానాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు.

కొట్రలో మరోసారి చోరీ

వెల్దండ, జూన్ 9 : మండలంలోని కొట్ర గ్రామంలో మరోసారి చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోకి చొరబడి కోళ్లపారం కాలనీలోని అందుగుల బాలచంద్రమ్మ ఇంట్లో బీరువా పగులకొట్టి అందులో ఉన్న తులంన్నర బంగారం, 10 తులాల వెండి, రూ.17,500 నగదును అపహరించుకుపోయారు. అందుగుల రామస్వామి ఇం ట్లో బీరువాను ధ్వంసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బీరువాను చూపుతున్న బాలచంద్రమ్మ

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

పెద్దకొత్తపల్లి సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పెద్దకొత్తపల్లి, జూన్ 9: మం డలకేంద్రం సమీపంలో వాహనాలను పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు వెళ్లి తిరిగి వెళ్తున్న వా హనదారులను ఎస్సై సతీశ్ డ్రం కెన్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవర్లు వేగంగా వాహనాలు నడపవద్దని, జాగ్రత్తగా గమ్యానికి చేరుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. బైక్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

నేడు రైతులకు అవగాహన

వంగూరు, జూన్ 9 : వానకాలంపంటల సాగుపై సోమవారం మండలకేంద్రంలోని వైవీ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏవో తనూజ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరై పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు.

రోడ్డుపై తవ్వకాలు నిలిపివేత

- కాంట్రాక్టర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నమస్తే ఎఫెక్ట్

నవాబ్‌పేట, జూన్ 9: నవాబ్‌పేట మండల కేంద్రం నుంచి జిల్లాకేంద్రం వరకు ప్రధాన రోడ్డు పక్కన నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న ఎయిర్‌టెల్ 5జీ కేబుల్ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదివారం నిలిపివేశారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఇష్టారీతిగా తవ్వకాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించారు. డీఈఈ సంధ్య, ఏఈఈ ప్రశాంత్ ఆదివారం కాంట్రాక్టర్‌పై నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్సై అభిషేక్‌రెడ్డి, తమ సిబ్బందిని పనివద్దకు పంపి కేబుల్ పనులను నిలిపివేయించారు. రోడ్డును ధ్వంసం చేయించిన కాంట్రాక్టర్‌కు రోడ్లు, భవనాల శాఖ నిబంధనల మేరకు జరిమానా విధిస్తామని డీఈఈ సంధ్య, ఏఈఈ ప్రశాంత్ వివరించారు.

కొట్రలో బొనాలతో ఊరేగింపుగా బయలుదేరుతున్న మహిళలు

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

వెల్దండ, జూన్ 9 : మండలంలోని కొట్ర గ్రామంలో బొడ్రాయి పండుగ మొదటి వార్షికోత్సవాన్ని ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బొడ్రాయితోపాటు శివుడు, కోట మైసమ్మ తదితర దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం మహిళలు బొనాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు తైబజార్ వేలం

తిమ్మాజిపేట, జూన్ 9 : తిమ్మాజిపేటలో వారాంతపు సంత నిర్వహణలో భాగంగా తైబజార్ వసూలు చేసేందుకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగే వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

వైద్య శిబిరం విజయవంతం

కల్వకుర్తిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కల్వకుర్తి రూరల్, జూన్ 9 : కల్వకుర్తి పట్టణంలోని షిరిడిసాయి సత్యసాయి ప్రశాంతి సన్నిధిలో ఆదివారం సత్యసాయి సేవా సమితి కల్వకుర్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 454 మందికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో ఆదివారం ప్రశాంతి సన్నిధిలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు స్వామి, కృష్ణ, పూజిత, ప్రవళిక, నవీన్, చంద్రకాంత్, శ్రీధర్ సత్య సాయి సేవా సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ, జూన్ 9 : తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ ప్రమీల ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ప్రజలు, రైతులు గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలులతోపాటు భూసమస్యలు తదితర వాటిని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే తప్పకుండా పరిష్కారం చేస్తామని పేర్కొన్నారు. మండలంలో అన్ని శాఖల అధికారులు ప్రజావాణికి విధిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

చారకొండ, జూన్ 9: ఉపాధిహామీ పథకంలో కూలీల సమస్య నేపథ్యంలో 'ఉపాధిహామీ చట్టం అమలు–సవాళ్లు' అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు రాజ్యసభ సభ్యుడు శివదాసన్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కతోపాటు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీ వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నాగయ్య, వెంకట్రాములు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు మండలంలోని ఉపాధిహామీ కూలీలు, మేట్లు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

సదస్సుకు తరలిరావాలి

కోడేరు, జూన్ 9 : ఉపాధి హామీ చట్టం అమలు – సవాళ్లు అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సదస్సుకు మండలం నుంచి ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

అల్లాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాడూరు, జూన్ 9 : ఆయా గ్రామాల్లోని బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు కట్టా శ్రీనివాస్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఆదివారం మండలంలోని అంతారం, అల్లాపూర్ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి బడికి వెళ్లని పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నామన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని అర్హతలతో మెరుగైన విద్యను అందించడం జరుగుతుందని వివరించారు.

19న కొబ్బరికాయల విక్రయానికి వేలం

బిజినేపల్లి, జూన్ 9 : మండలంలోని పాలెం గ్రామంలోని అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయించుకునేందుకు ఈనెల 19న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రంగారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి, కల్యాణ మండపం, 12 గదుల కిరాయి నిర్వహణ కోసం రూ.50వేల డిపాజిట్, 4 ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకోసం రూ.20 వేల డిపాజిట్, కొబ్బరి చిప్పల సేకరణ కోసం రూ.5వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం పాటను దక్కించుకున్న వారు ఏడాదికాలం పాటు హక్కుదారులని, ఆసక్తిగల వారు పాల్గొనాలన్నారు.

చౌడమ్మ ఆలయంలో చోరీ

తిమ్మాజిపేట, జూన్ 9 : మండల కేంద్రంలోని చౌడమ్మ ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రిల్ తరహాలో తలుపులు మూసి ఉండగా కొందరు ఆగంతకులు కర్ర సాయంతో ఆలయంలోని అమ్మవారి ఒంటిపై ఉన్న వెండి ఆభరణాలను అపహరించినట్లు పేర్కొన్నారు. మొత్తం 35 తులాల వెండి వస్తువులు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు కమిటీ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.